శాంతా-వసంత ట్రస్టు పురస్కారాలు ప్రదానం

ఉత్తమ సాహితీవేత్త పురస్కారాన్ని డాక్టర్ శలాక రఘునాథశర్మ, ఉత్తమ సాహిత్య సేవ పురస్కారాన్ని ఎస్.వి సురేశ్‌లకు ప్రదానం చేస్తున్న వరప్రసాద్‌రెడ్డి, ఆచార్య శివారెడ్డి,చెన్నయ్య

తెలుగు యూనివర్సిటీ, మార్చి 9: సాహిత్యం, సంగీతం తదితర కళాప్రక్రియలు మానసిక ఆరోగ్యాన్ని కలిగిస్తాయని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్యల ఎల్లూరి శివారెడ్డి అన్నారు. శాంతాబయోటెక్ అధినేత, పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ వరప్రసాదరెడ్డి ఆధ్వర్యంలోని శాంతావసంతా ట్రస్టు 2025కుగాను సాహితీ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలకు విశేషమైన సేవలందిస్తున్న మహామహోపాధ్యాయ డాక్టర్ శలాక రఘునాథశర్మకు డాక్టర్ వరప్రసాదరెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారం, ఉద్యోగ సోపానం పత్రికా సంపాదకులు ఎస్.వి సురేశ్‌కు కోడూరు వెంకటరమణారెడ్డి ఉత్తమ సాహితీ సేవా రత్నపురస్కారాన్ని ప్రదానం చేశారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి శాలువాతో సత్కరించారు. స్వయం కృషితో ఎదిగిన వరప్రసాదరెడ్డి ఉన్నత స్థానానికి చేరుకుని మానవుల శారీరక ఆరోగ్యానికి ఔషధాలను, మానసిక ఆరోగ్యానికి ఉత్తమ సాహిత్యాన్ని సృశిస్తున్న వారిని ప్రోత్సహిస్తూ ఇతరులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారని శివారెడ్డి ప్రశంసించారు. సాహితీ పరిశోధకులు గంధం బసవ శంకరరావు, సినీ విశ్లేషకులు ఎస్.వి రామారావు, ట్రస్టు కార్యదర్శి తొడుపునూరి నవీన్, సభ్యుడు ఎంబీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ వేదికపై తెలుగు యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య అనుమాండ్ల భూమయ్య సాహిత్య శ్రేణిలో ప్రచురించిన దశ గ్రంథ సంపుటిని వరప్రసాదరెడ్డి ఆవిష్కరించారు.

మహిళా స్ఫూర్తి అవార్డులు అందజేత

మహిళలకు మహిళాస్ఫూర్తి అవార్డుల ప్రదాన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి

తెలుగు యూనివర్సిటీ, మార్చి 9: ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని, ఇది మంచి పరిణామమని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ కొండూరు హరినారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి ఈ సందర్భంగా పలువురు మహిళలకు మహిళాస్ఫూర్తి అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు. మహిళలను గౌరవించినప్పుడే సమాజం అభ్యున్నతి సాధిస్తుందని ఆయన హితవు పలికారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి అన్ని రంగాలలో మహిళల ప్రాధాన్యత పెరిగిందని పేర్కొన్నారు. పురస్కారాలను డాక్టర్ రాధ కుసుమ, తాళ్ళూరి మయూరి, కొత్తూరి శ్రీదేవి, డాక్టర్ పి.విజయలక్ష్మి పండిట్, వీణాసింగ్, పాల జ్యోత్స్న, ఇందునయనలకు ప్రదానం చేశారు. కళ పత్రిక సంపాదకులు డాక్టర్ మహ్మద్ రఫీ, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, విశ్రాంత జడ్జి చంద్రయ్య, నారాయణ, నిర్వాహకులు కొండూరు హరినారాయణరెడ్డి, కె.మురళీమోహన్ రాజు, భోగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు రైతులు తరలిరావాలి

హిమాయత్‌నగర్‌లోని రైతుసంఘం కార్యాలయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

హిమాయత్‌నగర్, మార్చి 9: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 13న ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాకు రైతులు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయా లని ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు పశ్యపద్మ, టి.సాగర్, జక్కుల వెంకటయ్య పిలుపునిచ్చారు. ఆ ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ ఆదివారం హిమాయత్ నగర్‌లోని రాష్ట్ర రైతు సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ వ్యవసాయ మార్కెట్ ముసాయిదాను తీసుకురావడంతో రైతులకు తీరని అన్యాయం జరిగే అవకాశం ఉందని, తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ సంస్థల మేలు కోసం కేంద్రం పని చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్‌కేఎం నేతలు వెంకటేశ్వర్లు, శోభన్‌నాయక్ పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కులగణన సర్వే నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు కుమారస్వామి, తదితరులు

కాచిగూడ, మార్చి 9: బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆరోపించారు. ఆదివారం కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో చేసిన కుల గణన సర్వే మాదిరిగా దేశవ్యాప్తంగా కుల గణన జరిగినప్పుడే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. బీజేపీ మంత్రులు, ఎంపీలకు ధైర్యం ఉంటే కుల గణనపై ప్రధానిపై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ ప్రధానిగా బీసీగా ఉండి బీసీలకు అన్యాయం చేస్తున్నారు. త్వరలో బీసీల సత్తా ఏంటో మోదీకి రుచి చూపిస్తామని హెచ్చరించారు. కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి వేలాది మందితో త్వరలో ఢిల్లీలో ధర్నాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఎన్జీవో కేంద్ర సంఘం కోశాధికారి శ్రీనివాసరావు మృతి

సంతాపం తెలిపిన టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం ముజీబ్ హుస్సేనీ

రామినేని శ్రీనివాసరావు(ఫైల్)

సుల్తాన్ బజార్,మార్చి 9: టీఎన్జీవో కేంద్ర సంఘం కోశాధికారి, తెలంగాణ ఉద్యమకారుడు రామినేని శ్రీనివాసరావు గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ ఆదివారం మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్ర సాధనలో టీఎన్జీవో కేంద్ర సంఘంతో పాటు రామినేని శ్రీనివాసరావు ఎంతో కృషి చేశారు. ఇటు ఉద్యమంలో పాటుపడుతూనే ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కూడా ఆయన చేసిన కృషి మరువలేనిది. శ్రీనివాసరావును తెలంగాణ శీనుగా, బొట్టు శ్రీనుగా చాలా మందికి సుపరిచితుడు. ప్రస్తుతం ఆబ్కారీ శాఖలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్‌రావు మృతి పట్ల కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ, టీఎన్జీవో కేంద్ర సంఘం మాజీ అధ్యక్షులు స్వామి గౌడ్, దేవిప్రసాద్‌రావు, కారం రవీందర్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు పాపన్న గౌడ్

- తెలుగుతల్లినగర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ
- పాల్గొన్న శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే కేపీ

తెలుగుతల్లినగర్‌లో కౌండిన్య మహాముని గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ విప్ కేపీ.వివేకానంద్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

జేడిమెట్ల, మార్చి 9: సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీ తెలుగుతల్లినగర్‌లో కౌండిన్య మహాముని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ విప్ కేపీ.వివేకానంద్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలపై జరుగుతున్న అణచివేత, దురాగతాలు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన బలహీనవర్గాల మహాయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. అంతకముందు స్థానికంగా గల రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ముఖ్యఅతిథులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్ అభినవ్, కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, ములుగు మాజీ ఎంపీపీ అంజన్ గౌడ్, సీఐ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వారాల వినోద్, వెంకటయ్య, తారా సింగ్, గుబ్బాల లక్ష్మీ నారాయణ, రాజ్‌కుమార్, డివిజన్ గౌడ సంఘం ప్రెసిడెంట్ కొత్త గౌడ సతీశ్‌కుమార్, కౌండిన్య మహాముని గౌడ సంఘం అధ్యక్షులు ఎంఎస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జిత్తుల బాలకృష్ణ గౌడ్, కోశాధికారి సూరగాని వెంకట్ సుబ్బారావు గౌడ్, సంఘం సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు నిలిపివేయడం సరికాదు

నిరసన కార్యక్రమంలో నినదిస్తున్న పలువురు నాయకులు, ఉద్యోగులు

కవాడిగూడ, మార్చి 9: జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థకు కేంద్ర బడ్జెట్‌లో నిధులను నిలిపివేయడం సరికాదని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డీజీ నరసింహ, సీఐటీయూ రాష్ట్ర నాయకులు ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్‌శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల పూర్తి గ్రాంట్‌ఇన్ ఎయిడ్‌ను పునరుద్ధరించాలన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీరాజ్ అకడమిక్ అసోసియేషన్, పెన్షనర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌లో జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ సంస్థకు నిధులు నిలిపివేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం ఇందిరాపార్కు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ రెండింటికి విధాన రూపకల్పన అందించడంతోపాటు క్షేత్ర స్థాయిలో కార్యదర్శులు, ప్రతినిధులకు శిక్షణఇచ్చే ఏకైక జాతీయ సంస్థ అన్నారు. ప్రస్తుత భవిష్యత్ పెన్షనర్ల పెన్షన్, పదవీ విరమణ ప్రయోజనాల దృష్ట్యా పాత పెన్షన్ పథకం ప్రకారం గ్రాంట్‌ఇన్ ఎయిడ్ నుంచి నిధులు అందించాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రిజిస్టర్ ఫైనాన్షియల్ అడ్వైజర్ సహా ఖాళీగా ఉన్న సీనియర్ స్థానాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ నిరసనలో అకడమిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్యోతి, ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మణి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు నిత్య విద్యార్థులు

ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

జర్నలిస్టులకు సూచనలిస్తున్న ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

సిటీ బ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ): చదవడం, నేర్చుకోవడం, రాయడం ద్వారానే జర్నలిస్టులు వృత్తిలో రాణిస్తారని, నిత్య విద్యార్థులుగా ఉండాలని మీడియా అకాడమీ మాజీ అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. ఖైరతాబాద్ పెరిక భవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పెరిక జర్నలిస్టుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి జర్నలిస్టు ప్రజోపయోగకర వార్తలు రాసినప్పుడే ఆ వృత్తికి సార్థకత ఉంటుందని చెప్పారు. జర్నలిస్టులకు సమాజంలో జరిగే విషయాలపైనే అవగాహన ఉండాలని సూచించారు. సెన్సేషనల్ కథనాలు రాసినప్పుడే జర్నలిస్టుకు గుర్తింపు వస్తుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు గటిక విజయ్‌కుమార్, మైలరిశెట్టి చైతన్య, బరపటి సంపత్, బంధు శ్రీధర్, ముద్దసాని రాంచందర్, పెరిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు శ్రీరామ్ దయానంద్, పెరిక వసతి గృహం అధ్యక్షుడు డాక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, నాయకులు ఊశన్న, మనోహర్, ఆనంద్, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

మేరీ క్యూరీ మహిళా జర్నలిస్టులకు ఆదర్శం

సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ హరీశ్

సిటీ బ్యూరో, మార్చి 9,(నమస్తే తెలంగాణ): ఫిజిక్స్, కెమిస్ట్రీ రెండు విభాగాలలో నోబెల్ బహుమతి పొందిన మేరీ క్యూరీని ఆదర్శంగా తీసుకొని నేటి తరం మహిళా జర్నలిస్టులు అన్ని రంగాల్లో రాణించాలని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ హరీశ్ అన్నారు. ఆదివారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో ఆన్లైన్ జర్నలిజం – మహిళా జర్నలిస్టుల సాధికారిత అనే అంశంపై నిర్వహించిన ఒక్క రోజు శిక్షణా తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ తరగతులకు 50 మంది మహిళా జర్నలిస్టులు హాజరయ్యారు. జర్నలిస్టులకు వృత్తి పరంగా ఉపయోగపడే అంశాలపై 10 పుస్తకాలు, సర్టిఫికెట్లు అకాడమీ అందజేసింది. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, మహిళా జర్నలిస్టుల సమన్వయకర్త రాజేశ్వరి పాల్గొన్నారు.

మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఫారెస్ట్ బాత్

- తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ డెక్కన్ వడ్స్, ట్రయల్స్ పేరిట ఎకో టూరిజం కార్యక్రమాలు
- ట్రెక్కింగ్,చెట్లు,పక్షులపై అవగాహన
- నేటి ఫారెస్ట్ బాత్‌లో 19 రకాల పక్షుల గుర్తింపు

మంచిరేవులలోని ఫారెస్ట్ బ్రేక్ పార్క్‌లో ఫారెస్ట్ బాత్‌లో అవగాహన కల్పిస్తున్న మేనేజర్

మణికొండ, మార్చి 9: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డెక్కన్ వడ్స్ & ట్రయల్స్ పేరిట నగర శివారులోని మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఆదివారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు 'ఫారెస్ట్ బాత్' కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ ఫారెస్ట్ బాత్ కార్యక్రమంలో 40 మంది పక్షి ప్రేమికులు పాల్గొన్నారు. ఇందులో 9 మంది నిజాంపేట్, కూకట్‌పల్లి, కొండాపూర్, నార్సింగి వాళ్లు కాగా, 31 మంది సాయి సేవ సంఘ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఫారెస్ట్ బాత్‌కి విచ్చేసి ఎఫ్.ఆర్.ఓ ఎస్.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ప్రాజెక్ట్స్ మేనేజర్ ఎకో టూరిజం సుమన్ ఫారెస్ట్ బాత్ ప్రోగ్రాం గురించి, అందులో పొందుపర్చిన కార్యక్రమాల గురించి వివరించి వారిని 2 టీములుగా విభజించి వేర్వేరు ట్రెక్ రూట్‌లలో ట్రెక్కింగ్, నేచర్ ట్రయిల్, బర్డింగ్ (పక్షుల వీక్షణ), చెట్లు, సహజ రాతి నిర్మాణాలు, కనపడిన పక్షుల గురించి వివరించారు. ఒక టీం కు ఎఫ్‌డీసీ నేచురలిస్ట్ అపరంజని, మరొక టీంకు రిసోర్స్ పర్సన్‌గా హాజరైన వీరయ్య చౌదరి గైడ్‌గా వ్యవహరించారు. ఫారెస్ట్ బాత్‌లో చిన్న పసరిక, నల్ల యోత్రింత, ఊదా తేనె పిట్టలకు ముఖి పిట్ట,ఆడ నెమలి, పికిల పిట్ట, మొగ నెమలి వంటి పక్షులతోపాటు ఊదా తేనె పిట్ట యొక్క గూడు, గిజి గాడి గూడు, మీసోలిథిక్ కాలం నాటి రాక్ ఆర్ట్ పెయింటింగ్స్ వాటి యొక్క గొప్పతనం వంటి విషయాల గురించి ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం వి.తనూజ, ఎఫ్.ఆర్.ఓ. శ్రీనివాస్, ప్రాజెక్ట్స్ మేనేజర్ సుమన్ కళ్యాణపు, నేచురలిస్ట్ అపరంజని, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మా రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి తాగునీటి ప్రాజెక్టులకు టెండర్లు

రెండు దశల్లో 20 టీఎంసీల గోదావరి నీటి తరలింపునకు ప్రణాళికలు

సిటీబ్యూరో, మార్చి 9(నమస్తే తెలంగాణ: గోదావరి తాగునీటి ప్రాజెక్టుల కోసం జల మండలి టెండర్లను ఆహ్వానించింది. ఫేజ్ 2, ఫేజ్-3 ద్వారా నగరానికి 20 టీఎంసీల నీటిని తరలించేందుకు హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో రూ.5383 కోట్లతో రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టనున్నారు. మొదటి ప్యాకేజీలో మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు, రెండో ప్యాకేజీలో ఘన్‌పూర్ నుంచి ఉస్మాన్‌సాగర్ వరకు పనులు చేపట్టనున్నారు. పైపులైన్, పంపింగ్, నిర్మాణం టెస్టింగ్, కమిషనింగ్ పనులు చేపట్టేందుకు టెండర్లను వాటర్ బోర్డు ఆహ్వానించింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో భాగంగా ప్రభుత్వం 40 శాతం వాటాగా రూ.2153 కోట్లు, ఏజెన్సీ 60శాతం వాటాగా రూ.3230 కోట్లతో ప్రాజెక్టును చేపట్టనున్నారు. ప్రభుత్వ వాటాగా హడ్కో నుంచి రూ.2వేల కోట్ల లోన్ రూపంలో జలమండలి తీసుకోనున్నది. అయితే ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయనున్నట్లుగా వాటర్ బోర్డు అధికారులు పేర్కొన్నారు.

సర్వే వైఫల్యానికి రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత

కాచిగూడ, మార్చి 9: తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వే వైఫల్యానికి కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం నింబోలిఅడ్డ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో పాల్గొనని 3.56 లక్షల కుటుంబాల కోసం ఇటీవల నిర్వహించిన బీసీ కుల గణన సర్వేలో ఎంతమంది పాల్గొన్నారో బహిరంగంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అనుభవం లేని వ్యక్తులతో కుల గణన సర్వే చేయించడం వల్ల సర్వే నీరుగారిందని ఆయన ఆరోపించారు. సర్వే నిజాయితీగా జరిగితే బీసీలు మరింత శాతం పెరుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, ముత్యాలరావు, ప్రశాంత్, భాస్కర్, సత్యపాల్‌సింగ్, ప్రదీప్ గౌడ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు విక్రయించొద్దు

- ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి
- అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్



బీసీ నాయకులు, విద్యార్థులతో కలిసి ధర్నాలో నినదిస్తున్న ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ, మార్చి 9: ప్రభుత్వ భూములను విక్రయించకుండా అందులో ప్రభుత్వ హాస్టళ్లకు, గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తక్షణమే అద్దె బకాయిలను కూడా చెల్లించాలన్నారు. లేనట్లయితే రానున్న రోజుల్లో విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని, అద్దె బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం నాయకులు వేముల రామకృష్ణ, నీల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు వద్ద ఛలో ఇందిరాపార్కు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు ప్రజల ఆస్తులని, వాటిని ప్రజా అవసరాలకు, పేదల ఇండ్ల నిర్మాణానికి, ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లు, పాఠశాలల నిర్మాణానికి ఉపయోగించాలన్నారు. అలా కాకుండా వాటిని అమ్మడం సరికాదన్నారు. ఇప్పుడు ప్రభుత్వ భూములను అమ్మితే భవిష్యత్ తరాలకు ఏమి మిగులుతుందని కృష్ణయ్య ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 295 హాస్టళ్లను నిర్వహిస్తున్నారని, ఒక్క హాస్టల్‌కు కూడా సొంత భవనం లేక అద్దె భవనాల్లోనే కొనసాగిస్తున్నారని చెప్పారు. హాస్టల్స్ ప్రారంభించి 27 సంవత్సరాలు కావస్తున్నా ఒక్కడానికి కూడా సొంత భవనం లేకపోవడం దారుణమన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు సొంత భవనాలు ఉన్నప్పటికీ కేవలం బీసీ హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలను నిర్మించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ స్థలాలను వేలం వేయకుండా వాటిలో బీసీ కళాశాలల హాస్టళ్లు, బీసీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉన్నత చదువులు చదువుకునే బీసీ విద్యార్థుల కోసం హాస్టళ్లు నిర్మించాలన్న ఆలోచన ప్రభుత్వానికి, పాలకులకు ఎందుకు రావడం లేదని నిలదీశారు. అద్దె భవనాల్లో హాస్టళ్లు, గురుకులాలను కొనసాగిస్తుండటంతో సౌకర్యాలు సక్రమంగా లేక విద్యర్థులు చదువుకోవడానికి ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అద్దె బకాలయిలను కూడా చెల్లించకపోవడంతో ఖాళీ చేయాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయన్నారు. అద్దె, ఫీజు, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు జిల్లపల్లి అంజి, మణికంఠ, మల్లేశ్, అనంతయ్య తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

కవాడిగూడ, మార్చి 9: తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ఉద్యోగులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం దోమలగూడలోని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. గత పీఆర్సీ గడువు ముగిసి 20 నెలలు గడిచిందన్నారు. అధికారంలోకి రాగానే ఆరు నెలల్లోనే పీఆర్సీని మెరుగైన ఫిట్‌మెంట్‌తో అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పెండింగ్ బకాయి బిల్లులు, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్‌ఐ సరెండర్ లీవ్ బిల్లులు, మెడికల్ బిల్లులు, రిటైర్డ్ అయిన వారి బెనిఫిట్స్ సంవత్సరాల తరబడి చెల్లించకపోవడంతో ఉద్యో